# మకరరాశి

## ఆర్.దమయంతి

పుష్యమాసం. మంచు రాత్రి. చల్లటి చలి శరీరాన్ని వొణికిస్తూంది.

మసక మసగ్గా వెన్నెల..రేకులు విచ్చుకోని మల్లె మొగ్గలా వుంది.

నిశ్శబ్దాన్నిరాజ్యమేలుకోమన్న ఈ లోకం- గాఢ నిదురలో జారుకుంది..

గుడ్డి వెన్నెల కాండిల్‌లైట్‌లా వెలుగుతోంది.

కిటికీ పక్కనే..కేన్ కుర్చీలో కుర్చీలో కూర్చుని..తన కోసమే వచ్చే రాత్రి సోయగాలను తనువారా తిలకిస్తోంది మాలతి. కానీ.. ఎప్పటిలా ఆనందంగా కాదు. ఏదో తెలీని వెలితి..మనసంతా పరచుకుని ఉంది. తెల్లకాగితం మీద వొలికిన సిరామరకలా..నల్లగా ఆక్రమించుకుంటోంది.

బయట కురుస్తున్న మంచు కంటే లోన చుట్టుకున్న ముసురే ఆమెని మౌనంగా మార్చేస్తోంది. సరిగ్గా హేమంతంలోనే ఈ మానసిక బాధ అధికమౌతుంటుంది. కాలమంతా ఆగిపోతున్నట్టన్పిస్తుంది.

హృదయ సముద్రంలోంచి ఉండుండి ఒక విషాద కెరటం- ఎగసి విరిగిపడుతున్నప్పుడల్లా... బాధగా కళ్లు మూసుకుంటుంది...

ఆ చమ్మలో- బాల్యస్మృతులు తడిసి ముద్దయి గుండెని మరింత మెలిపెడ్తుంటాయి ఆమెని.

***

చిన్నప్పట్నుంచి అమ్మ పొట్టని గట్టిగా కౌగిలించుకుని పడుకునే అలవాటు మాలతికి. అమ్మ వొడి వెచ్చదనంలోని హాయి తనకి నిద్రలో బాగా తెలిసేది. అమ్మ తన పక్కన లేదన్న సంగతి ఎలా తెలుస్తుందో ఏమో కానీ...వెంటనే లేచి కుర్చునేది. తన తల్లిని ఎవరో లాక్కెళ్లిపోయినట్టు ఉలిక్కిపడేది. పక్కన అమ్మ కనిపించకపోయేసరికి గుండె దిగులయిపోయేది. వెంటనే-

''అమ్మా! అమ్మా...'' అంటూ ఏడ్పు గొంతుతో పిలిచేది. అమ్మని ఎవరయినా తీసుకెళ్లిపోయారా! ఆ చిన్ని మనసు కీడు శంకించేది. వెంటనే దుఃఖమేసేది. అప్పుడు మాలతికి ఆరేళ్లు....

ఆ అలికిడికి తండ్రి నిద్రలోంచి లేచి ఆమెని దగ్గరికి తీసుకున్నాడు.

''అమ్మ కావాలా తల్లీ.. దా.. నేను తీసుకెళ్తా..'' అంటూ ఎత్తుకుని బయటకు తీసుకొచ్చాడు రామ్మూర్తి.

''అదిగో అమ్మ'' అంటూ చూపించాడు.

అక్కడ అమ్మ...లాంతరు వెలుగులో ముగ్గేస్తూ కన్పించగానే ఎంత ఆనందమేసేదో!.. ఆమెకి.

అరుగుమీద దిండేసి మాలతిని కూర్చోబెట్టి, ఆయన తన మఫ్లర్‌ని కూతురికి చెవుల నిండా కప్పి..మళ్లీ లోపలకెళ్లి పడుకునేవాడు.

మాలతి ఆకాశంలో చంద్రుణ్ణి, మినుకు మినుకు మంటున్న నక్షత్రాలను చూస్తుండేది. చలిగాలి వొణికించేదే కాదు. పొగడపూల చెట్లనిండా వెన్నెల కాసేది. ఆకులు వింత కాంతితో మెరిసిపోతుండేవి.

యింటిముందు విశాల ప్రాంగణం. చుట్టూ ప్రహరీ గోడ. ఇంటిముందు రెండు పెద్దపెద్ద బొగడపూల చెట్లు...కొమ్మలనిండా తెల్లటి పొగడపూలు..ఘుమఘుమ వాసనలు విరజిమ్ముతుండేవి. మట్టినేలని నాలుగు దిసెలా శుభ్రంగా ఊడ్చి,



పేడతో అలికి ఆరాక అమ్మ ముగ్గులు వేస్తుంది. ఎప్పుడూ ఇంతగా వేయదు. ఈ చలికాలంలోనే వేస్తుంది. ఎందుకనో!?

అమ్మని చూసాక మళ్లీ నిద్రపోవాలనిపించింది మాలతికి. చిన్నినోరు తెరిచి ఆవలించింది.

అమ్మని ఎదురుగా చూశాక భయం పోయి, ఎంతో హాయిగా నిశ్చింతగా వుందామెకి. గుండెల్లో దిగులంతా తీసేసినట్టయింది.

తలొంచుకుని ముగ్గువేయడంలో నిమగ్నమయిన అమ్మ ముఖం మీద లాంతరు కిరణం ప్రతిఫలిస్తోంది. ఆవిడ తలమీంచి కప్పుకున్న చీర జరీ అంచు మెరుస్తోంది తమాషాగా. ముక్కుపుడక వుండుండి తళుక్కుమంటో చమక్కులు విసిరిపోతోంది. ఫాలభాగాన పావలా నాణెమంత కుంకుం బొట్టు పవిత్రంగా వుంది. నిదురలో చెదిరిన జుట్టు ముఖంమీద అతుక్కుపోయి వింత ఆందాన్నిస్తోంది. ఆ క్షణంలో అమ్మ మరింత అందంగా కన్పించింది మాలతికి.

ఎడం చేతిలోని ముగ్గుగిన్నెలోకి మాటిమాటికి మునుగుతున్న వేళ్ళ కొసలు- గిన్నెలోంచి వెన్నెలని తోడుకుంటున్నట్టున్నాయి...

తల్లి ముగ్గులేస్తూ ముగ్గు చుట్టూ ప్రదక్షిణం చేస్తుండేది. మాలతి వేపు వీపు పెట్టి కూర్చోగానే అరుగుమీంచి లేచి- తల్లి వెనకనించి వీపు మీద వాలేది. రెండు చేతులూ ఆమె కంఠాన్ని పెనవేసుకుపోయేవి. ఆవిడ ఏమీ అనేది కాదు. పైగా మాలతి చేతుల మీద ముద్దు పెట్టుకునేది. ''నిద్ర రావడం లేదా బంగారు తల్లికి'' అనేది. ముగ్గు మీంచి చూపు మరల్చకుండానే.

తను కూడా ముగ్గు వెంపే చూస్తూ ''ఊ'' అనేది.

కాసేపు కూర్చుని, కాసేపు వొంగుని, కొంచెంసేపు ఆగి ఆలోచించుకుని, మరికొంచెంసేపు వేలితో చుక్కల్ని లెక్కపెట్టుకుని...ముగ్గంతా చకచకా వేసేసేది. ముగ్గేస్తున్నంతసేపూ అమ్మ చేతి వేళ్లవంకే చూసేది మాలతి. అరచేతి చివరి మూడు వేళ్లు మూసుకుని వుండేవి. ఉంగరం వేలికి లక్ష్మీదేవి బంగారుటుంగరం సిరిలా తోచేది. చూపుడు వేలికున్న పగడపుటుంగరం చీకట్లో సయితం ఎర్రగా పొగడపండులా వుండేది. ముగ్గువేస్తున్నంతసేపూ కదుల్తున్న గాజుగాజులు ఆ నిశ్శబ్దంలో సితార తీగెల సవరించినట్టుండేవి...

ముగ్గు చుట్టూ లతల్ని అల్లాక ముగ్గు పూర్తయ్యేది. అలా... నాలుగడుగులు వెనక్కి వెళ్లి పూర్తయిన ముగ్గుని చూసుకునేది తల్లి. తల్లితో బాటు తనూ వెనక్కి నడిచి చూసేది. చెప్పలేనంత సంబరమేసేది...

''అమ్మా...బాగుంది...'' అనేది మాలతి అసంకల్పితంగా..

'అవునవునవును. మాలతి చెప్పిందే నిజం' అంటూ పక్షుల కిలకిలమనేవి. తమ హర్షాన్ని తెలిపేవి. తల్లి ముగ్గులకు అవే మరి మొట్టమొదటి ప్రేక్షకులయ్యేవి. వాటి రెక్కల చప్పుళ్లే చప్పట్లయ్యేవి. తల్లీ కూతుళ్లిద్దరూ తలపైకెత్తి ఆకాశంలోకి చూసేవారు. అప్పటిదాకా వీక్షిస్తున్న ఒక నక్షత్రం అక్కడ్నుంచి కదిలివెళ్ళిపోతూ అభినందనగా నవ్వి మాయమైపోయేది. ఆ నవ్వు చిత్రంగా తల్లి కళ్లల్లో కాంతిగా మారి మాలతిని మాయ చేసేది.

మరి కాసేపట్లో స్నానాలు చేసి, తులసి కోట ముందు దీపాలు వెలిగించి గొబ్బెమ్మలు పెట్టేది ఆవిడ. మాలతి చేత కూడా పెట్టించేది. చేతికి అంటిన తడిని అమ్మ కొంగుకు తుడిచేసేది మాలతి.

గొబ్బెమ్మల మీద బియ్యంపిండితో ముగ్గులేసి, పసుపు, కుంకుం బొట్లుపెట్టి, గుమ్మడిపూలను మధ్యలో గుచ్చి, అటు యిటు గోరింటపూలు, డిశెంబరం పూలు తురిమి గొబ్బెమ్మలను పెళ్లికూతుళ్లుగా మార్చేసేది. ధూప నైవేద్యాలయ్యాక ఒక్కో గొబ్బెమ్మని ముగ్గుల్లోకి పెట్టించేది కూతురిచేత.

సరిగ్గా అప్పుడే వేణుగోపాలస్వామి ఆలయ ధ్వజస్తంభ- జేగంటలు సవ్వళ్లు... తిరుప్పావై గానాలు గాలిలో తేలుతూ విన్పించేవి. వీనుల విందుగా వుండేది.

నేతిలో వేగిన జీడిపప్పు ఘుమఘుమలు మాలతికెంతో యిష్టంగా వుండేవి.

***

రేపు భోగి అనగా ముందురోజు రాత్రే బొమ్మలు పెట్టించేది. ఇంట్లో వున్న టేబుల్స్, టీపాయ్‌లు, స్టూల్స్, పెద్ద, చిన్న ట్రంకు పెట్టెలన్నీ బొమ్మలకు వాహనాలుగా మారిపోయేవి.

వాటన్నిటినీ అరలు అరలుగా పేర్చి కొత్త పట్టు చీరలు పరిచి, అటు యిటూ అంచులు తేల్చి సర్దేది. పై వరసలో అన్నీ పెద్దపెద్ద బొమ్మలు, రెండో వరసలో ఓ మాదిరి సైజు బొమ్మలు, మూడో వరస నుంచి కథలనీ, కావ్యాల ఆధారంగా క్రమపద్ధతిలో ఒక్కో సన్నివేశాన్ని చిత్రించేది.

గుమ్మమీద ఇసుక పోసి, దానిమీద నల్లమట్టిఅద్ది పార్కులు, యాత్రా స్థలాలు, పల్లెలు, కొండలు, కోనలు, గుట్టలు, ఏరులు, ఏటి గట్టున తోటలు అన్నీ తీసుకొచ్చిపెట్టేది. మాలతి చూస్తుండగానే ఒక అద్భుతమైన ప్రపంచం...కలల రాజ్యం కళ్ళెదురుగా ప్రత్యక్ష్యమైపోయేది.

ఇంతింత కళ్లు చేసుకుని చూస్తున్న మాలతిని దగ్గరకు తీసుకుని ముద్దులు పెట్టుకునేది తల్లి.

''మీ బడి ఎలా వుంటుందో అలా ఈ బొమ్మల్ని పెట్టు నానా'' అంటూ మాలతి చేత బడి కట్టించేది. కూతురు తయారు చేసిన బడిని భర్తకు చూపించి ఎంతో మురిసిపోయేది.

***

మర్నాడు వాకిట్లో అరుగుల మీద భజంత్రీ మేళగాళ్లు ఆసీనులయ్యేవారు. త్యాగరాజ కీర్తనలతో ఇల్లంతా హోరెత్తించేవారు.

ఒక పెళ్లంత హడావిడి ఆ యింట్లో చోటుచేసుకునేది. ''మా మాలతికి భోగిపళ్లు పోస్తున్నాం.. అందుకు...'' అంటూ తల్లి అందరితో చెప్పడం ఆమెకు బాగాగుర్తు.

ఆ సాయంత్రం పట్టుపరికిణీ జాకెట్ వేశారు మాలతికి. చేతినిండా గాజులు, భుజాలకు వొంకీలు, మెళ్లో గొలుసులు, పాపిడిబిందెలు, చెవులకు రాళ్ల జుంకాలతో అలంకరించి..

కుర్చీలో కూర్చోబెట్టారు. మాలతికి అదంతా కొత్తగా సంబరంగా వుండేది. అందరూ తనని అంత మురిపెంగా చూడటం వల్ల సిగ్గేసి తలొంచుకుని చేతులకు పండిన గోరింట ఎరుపును, కాళ్ల గజ్జలను చూస్తుండిపోయేది.

ముత్తయిదువలు ఒక్కొక్కరే వచ్చి, వెండిగిన్నెలోంచి రేగిపళ్లు, రాగికాసులు, పచ్చి శనగలు, బంతి రేకులు తీసుకుని గుప్పిట బిగించి మూడుసార్లు మాలతి తలచుట్టూ తిప్పి నెత్తి మీద పోసేవారు. కళ్లు మూసుకుని తెరిచే లోపు తన చుట్టూ పిల్లలు చేరి కాసుల్ని ఏరుకుంటూ కన్పించేవారు. 'భలే.. భలే..'' అనేది.

హారతిస్తూ పాటలు పాడేవారు ముదితలు. హారతిపళ్లెం పట్టుకున్న చేతుల నిండా గాజుల్నే చేసేది. వారి మెడలో మెరిసే చంద్రహారాలనూ, వాటి బంగారు రాళ్ళ బిళ్లలను చూస్తుండేది. మంగళారతులు అయిపోగానే దీపాలను హత్తుకున్న అరచేతుల్ని తన కళ్లకు అద్దడం, ఆ వెచ్చదనం కళ్లని స్పర్శించడం అన్ని అనుభూతులు ఆమెకు దివ్యంగా వుండేవి. కలకాలం గుర్తుండిపోయేలా.

వెండి పళ్లెం నిండా శనగలు, పంచదార చిలక,






పండూ తాంబూలాలను అమర్చి మాలతి చేత ఇప్పించేది. అలా యిస్తుంటే అమ్మలందరూ దీవించే వారు. 'వెళ్లొస్తాం భోగిపెళ్లికూతురా' అనే వారి సంబోధన మాలతికి మధురమైన జ్ఞాపకం.

సంక్రాంతి వెళ్లిపోతుందంటే ఏదో వెలితిగా వుండేది. బొమ్మలు తీసేయొద్దని మారాం చేసేది. తల్లి ఆమెని లాలించి, బుజ్జగించి, ఆమె చేతే అన్ని బొమ్మల్ని భద్రంగా మూట కట్టించేది.

మళ్లీ వచ్చే సంక్రాంతి కోసం ఎదురు చూస్తుండేది. కానీ, వాళ్ల జీవితాల్లో దానికంటే ముందు అమావాస్య వచ్చింది.

మాలతి తండ్రి హఠాత్తుగా గుండాగి మర ణించాడు. ఆయన మరణం ఇంటిని చీకటిగా మార్చేసింది. జీవన గమనం తప్పింది. పరిస్థితు లన్నీ తారుమారయిపోయాయి. ఇంట్లో వున్న వెండి, బంగారం కరిగిపోయాయి. పొలం, పుట్రా అన్నీ అమ్ముడయిపోయాయి.. హోదా స్థానంలో బీదరికం పేరుకుపోతూ వచ్చింది. ఎకరం భూమి లో ఎత్తుగా కట్టుకున్న ఇల్లు పోయింది. పాత పెంకుటింట్లోకి మకాం మారింది.

భర్తని, యింటిని ప్రేమించడం తప్ప ఏమీ రాని తల్లి అన్ని చేతిపనులు నేర్చుకుంది. బట్టలు కుట్టడం, ఎంబ్రాయిడరీ చేయడం, అప్పడాలు వొత్తడం, పిల్లలకింత పెట్టి తను పస్తుండటం.

మాలతి పెద్దదయింది. కష్టం సుఖం అన్నీ తెలు స్తున్నాయి. తల్లి ఆమెని పనిచేయనిచ్చేది కాదు. చదువు తప్ప ఇంకేం పని చేయొద్దనేది.

తను బాగా చదివి అమ్మని సుఖపెట్టాలనే పట్టు దల వచ్చేసింది ఆమెలో. చదువుకుంటూ ట్యూషన్లు చెప్పేది. తల్లి సగంలో కుట్టి వదిలేసిన పనిని పూర్తి చేసేది. కాలేజ్ పాసయింది.

సంక్రాంతులు వచ్చి వెళ్తూనే వున్నాయి. ఆమెలో తెలీని దిగుల్ని మిగిల్చిపోతునే వున్నాయి.

పోయిన బొమ్మలు చెల్లాచెదరవగా మిగిలిన వాటిలో తనకిష్టమైన పెళ్లిజంటను మాత్రం భద్రంగా దాచగల్గింది. పెట్టెలోనే కాదు, గుండెలో కూడా.

***

పెళ్లయ్యాక బొమ్మలు పెట్టుకుందామని ఆశప డింది మాలతి.

''నీ ముఖం. నువ్వు బొమ్మలు పెట్టుకోవడమే మిటోయ్. నీ ముచ్చట మన అమ్మాయి తీరు స్తుందిలే'' అంటూ నవ్వేవాడు భర్త.

అనుకున్నట్టుగానే అమ్మాయి పుట్టింది. మాలతికి ఆకాశమంత సంతోషమేసింది. అమ్మాయి పుడ్తే సంక్రాంతికి గొబ్బెమ్మలు పెట్టించుకోవచ్చు. బొమ్మలు పెట్టి పేరంటం చేసుకోవచ్చని.

కానీ ఆ ముచ్చట పట్టుమని పదేళ్లయినా తీర కుండానే కూతుర్ని హాస్టల్లో వుంచి చదివించేడు భర్త.

ఐఐటిలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన హారికకి కాంపస్ సెలెక్షన్‌లో జాబ్ వచ్చింది. ప్రాజెక్ట్ వర్క్ మీద అమెరికాకెళ్లింది. అక్కడ ఒక ఇండియన్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అల్లుడు గొప్పవాడు. అందగాడు. కానీ కళ్ల ముందు వుండరు. పండక్కీ పబ్బానికి ఫోన్‌లో శుభాకాంక్షలు అందుకోవడం తప్ప పండగ సంబరం ఏంవుంటుంది?

తన సంక్రాంతి వైభవం తనతోనే అంతమైపో యింది. ఇక మిగిలింది ఆ ఒక్క జ్ఞాపకంతప్ప...

తలచుకుంటే గుండెంతా ఖాళీ అయిపో యినంత బాధేస్తుంది.

అలికిడికి కిటికీలోంచి చూసింది. పనిమనిషి వచ్చిన చప్పుడయింది.

అప్పుడే తెల్లారిపోయిందా? తను గమనించనే లేదు..

రేపట్నుంచి పుష్యం మొదలు...అయితే మాత్రం ఏంవుందిలే.. అనుకుంటూ నిట్టూర్చి అక్కడ్నుంచి కదిలింది..

కాఫీ కోసం వంటింట్లోకి వెళ్తుంటే..ఫోన్ మోగింది..

''హలో...''

''హాయ్ మమ్మీ, హౌ ఆర్యూ'' హారిక తల్లిని పలకరించింది.

''ఏమిట్రా ఇవాళ ఫోన్ చేశావ్, సర్‌ప్రయిజ్'' అంది మాలతి.

''మమ్మీ అమీషా ఇండియా వస్తోంది. నీతో కలిసి సంక్రాంతి చేసుకుంటుందట. రేపే బయల్దేరి వస్తోంది. ఇక నువ్వు, అమ్మమ్మ కలిసి దానికి బోలెడు సంక్రాంతి సంబరాలు చేసి పంపాలి.''

వింటున్న మాలతికి ప్రాణం లేచివచ్చినట్ట యింది.

''నానా. నిజం..గానా...'' గొంతు జీరబో తుండగా అడిగింది.

''మమ్మీ నా చిన్నప్పుడు సంక్రాంతి ఎంత వైభ వంగా చేయించావో నేను మర్చిపోలేను. మనసు చికాగ్గా వున్నప్పుడల్లా నువ్ నాకు బాల్యంలో యిచ్చిన జ్ఞాపకాలను తల్చుకుని రిలాక్స్ అవు తుంటాను. నిజం మమ్మీ ఐ లవ్ యూ'' హారిక గొంతు ప్రేమతో వొణికితే మాలతి గుండె సంతో షంపట్టలేక వూగిపోయింది.

ఫోన్ పెట్టేసి పరిగెత్తుకుంటూ తల్లిగదిలోకి వెళ్లింది. బీరువాలో దాచిన పెళ్లి జంట బొమ్మల్ని తీసింది. అవి చెక్కుచెదరని అందంతో అలాగే వున్నాయి తెలుగు వారి సంస్కృతిలా..

''ఇప్పుడెందుకవి?'' దగ్గు ఆపుకుంటూ అడి గింది తల్లి.

''నీ మునిమనవరాలు వస్తోంది. సంక్రాంతికి. గొబ్బెమ్మలు పెట్టించి, బొమ్మల పేరంటం చేయించి పంపమంది నీ మనవరాలు. అందుకే హడావుడి...'' అరిచి చెప్పింది తల్లికి చెవుడని.

అప్పటిదాకా నోరు తెరుచుకుని వింటున్న ఆవిడ బోసి నోరు మరింత విశాలమైంది. నుదుటి మీద ముడతలు పడ్డ చర్మకింద కాంతి కదిలి మెరిసి నట్టయింది.

''ఒసేవ్ మాలతీ పెళ్లికూతురికి మరి పట్టుచీర కుట్టాలి గుర్తుంచుకో...'' అంది.

పట్టుచీర కాదమ్మా గాగ్రాచోళీ అనీ...'' అంటూ పూర్తిచేయబోయింది..

''సరేలేవోయ్..పెళ్లికొడుక్కి సఫారీ నేను తెస్తాలే కానీ... ముందు నీ చేత్తో మంచి ఫిల్టర్ కాఫీ ఇవ్వ యిచ్చేయ్..'' అంటూ పేపరందుకున్నాడు మాలతి భర్త.

ఇల్లంతా సంక్రాంతివచ్చి వాలినట్టయిపోయింది మాలతికి.

ఎక్కడా కాలు నిలవడం లేదు. యింటికి రంగులు, ముగ్గులు, గడపలకు పసుపులు, వాకిట్లో తోరణాలు, కొత్త బొమ్మలు, గొబ్బెమ్మలు, గాలిప టాలు, అరిసెలు, లడ్డూలు కట్టించాలి. యింకా అమ్మాయిని తీసుకెళ్లి పేరంటాలు పిలిపించాలి. ఉఫ్... ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది.

ఈ సంతోష తుఫాను మనవరాలు వస్తు న్నందుకు కాదు. సంక్రాంతి సిరి సంపదను, అనుభ వాల అనుభూతుల ఆస్తిపాస్తులు తన మనవరాలికి కూడా పంచబోతున్నందుకు.

ఆమె మనసు వెన్నెల్లో గోదావరయిపోతోంది.

మనవరాలి రాకకోసం వేచిచూస్తోంది మాలతి.

సరిగ్గా అప్పుడే.. ఆకాశంలో సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తున్నాడు... ★